# షార్ట్‌కట్

-అరుణా రవికుమార్

"ఓ అత్తా! యూ రాక్!" బుగ్గమీద ముద్దుపెడుతూ మోడర్న్ స్టయిల్‌లో మెప్పును తెలుపుతున్న బిందూని రేవతి ఆశ్చర్యంగా చూసింది.

సన్నగా, నాజూగ్గా ఉన్న కాళ్లకు అతుక్కుపోయినట్లుగా ఉన్న జీన్స్ ప్యాంటు, దానిపైన రెండు సైజులు తక్కువదా అనిపించే గులాబీ రంగు టీ షర్ట్, చెవులకు పొడుగ్గా వేళ్లాడుతున్న ఆక్సిడైజ్డ్ హ్యాంగింగ్స్ పెట్టుకున్న పదిహేడేళ్ళ బిందూ వేషమే కాదు మాట్లాడేతీరు కూడా పూర్తిగా మారిపోయింది.

"బిందూ!నీ టీ షర్టు కాస్త చిన్నదైందనుకుంటాను. పొరపాటున చెల్లిది వేసుకున్నావా ఏమిటి?" నవ్వుతూ అంది రేవతి.

"నో! నో! అత్తా. ఇది లేటెస్ట్ ఫ్యాషన్. కావాలంటే పేజీ-3లో వచ్చే ఈ ఫోటోలు చూడు" అత్తకు గర్వంగా పేపర్ తెరచి చూపించింది బిందూ.

ఆ ఫోటోలోని మోడల్స్ అందరిదీ ఇదే తంతు. ఒక్కొక్కరి వేషం, ఫోజు చూస్తే రేవతికి మతిపోయింది.

"న్యూజెర్సీలో మేముండే చోట చాలామంది తెలుగువాళ్లున్నారు. అక్కడ మన వాళ్లంతా పిల్లలను సంగీతం, డ్యాన్స్, భగవద్గీత క్లాసులకు పంపించి వాళ్లెక్కడ మన సంప్రదాయాలను, సంస్కృతిని మరచిపోతారో అని తెగ బాధపడిపోతుంటారు. ఇక్కడ కథ వేరుగా ఉంది వదినా!" రేవతి మాటలకు వంటింట్లోంచి టీ కప్పుతో బయటకు వచ్చింది సుమ.

"రేవతీ! ఇది మునుపటి హైదరాబాద్ కాదోయ్. ఇప్పుడంతా డబ్బుకు విలువ లేకుండా పోయింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, షాపింగ్‌మాల్స్, లివ్-ఇన్-రిలేషన్‌షిప్స్... తలచుకుంటేనే ఒక్కోసారి భయమేస్తుంది.

అవునూ! అసలు సంగతి మరిచేపోయాను. నీ ఫ్రెండ్ కూడా ఈ పేజీల్లో తరచూ దర్శనమిస్తుంది తల్లీ! గుర్తుపడతావేమో చూడు" పేపర్ తీసి రేవతికి అందించింది సుమ.

'ఎవరబ్బా! నా ఫ్రెండ్!' అనుకుంటూ పేపర్ చూస్తున్న రేవతి చూపు పేజీ మధ్యలో పెద్దగా కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న ఫోటో పైన నిలిచింది. రాష్ట్ర గవర్నర్, ఆయన సతీమణి పక్కన భారీ జర్దోసీ వర్కు గల గులాబీరంగు జరీ చీర, విరబూసిన పొడుగాటి కురులు, మెళ్లో ఖరీదైన వజ్రాల నెక్లెస్, రెండు సన్నదారాల్లాంటి స్ట్రాప్స్ గల జాకెట్, సినీతారలా మెరిసిపోతున్న ఆ మహిళ ఎవరో కాదు తన స్నేహితురాలు మాధవి.

'నిజంగా ఇది మాధవేనా!' తన కళ్లను తాను నమ్మలేకపోయింది రేవతి.

ఫోటో క్రింద క్యాప్షన్‌లో శ్రీమతి మాధవీ విశ్వనాథ్ అన్న పేరు చదివిన రేవతకి ఇంకా పెద్ద షాక్ తగిలినట్టయ్యింది.

"అప్పుడప్పుడు బాగుండదని పూర్తిపేరు రాస్తారు కానీ, ఆవిడను అందరూ ముద్దుగా 'మాడీ' అని పిలుస్తారు. ప్రఖ్యాత సమాజసేవకురాలు. సోషలైట్. సిటీలో ఏ కార్యక్రమం జరిగినా ఆవిడ అభిప్రాయం, ప్రస్తావన లేకుండా ఉండదు.

ఆమె స్నేహాలు, అభిరుచులు, ఆఖరికి ఆవిడ పెంపుడుకుక్కకు సంబంధించిన విషయాలు కూడా పత్రికలకు అతి ముఖ్యమైన సమాచారాలు. వారానికి ఏడురోజులు ఆమె ఫోటోలు పేపర్లో ఉండాల్సిందే" సుమ గలగలా చెప్పుకుంటూ పోతోంది.

"అవును మాధవీ రమేష్. మాడీగా ఐ మీన్ మాధవి విశ్వనాథ్‌గా ఎప్పుడు మారింది. రమేష్, బాబు ఏమయ్యారు? నాకేం అర్థంకావడం లేదు వదినా!" రేవతి మనస్సులో ఎన్నో ప్రశ్నలు.

రమేష్ ఎంత మంచివాడు.

మాధవిని, బాబు అవినాశ్‌ను ఎంత ప్రేమగా చూసుకునేవాడు.

"రేవతీ! నీకు మాధవి సంగతి తెలీదు. మాధవికి ప్రేమలు, బాంధవ్యాలు, అనుబంధాలు ఇవన్నీ ఒక లెక్కా!

దాని మనసంతా డబ్బు ఎలా సంపాదించాలనే ఒకే ఒక్క ఆలోచనతో నిండి ఉండేది కదా! అందులోను ఈజీమనీ, ఏమాత్రం శ్రమలేకుండా వచ్చే సొమ్మంటే పడి చచ్చే మనిషికి భర్త, పిల్లవాడిపై ప్రేమ ఏ మాత్రం లేదు. విశ్వనాథ్ రమేష్ జనరల్ మేనేజర్గా పనిచేసే గార్మెంట్స్ కంపెనీ యజమాని. అతనికి మాధవి వయస్సు కూతురుంది. పెద్ద కోటీశ్వరుడు.

ఆడవాళ్లంటే పిచ్చి. విశ్వనాథ్ కూతురు వసంతతో మాధవి స్నేహం చేసింది. తరచూ వాళ్లింటికి వెళ్ళే మాధవి విశ్వనాథ్ దృష్టిని ఆకర్షించింది. ఇంకేముంది ముందు రమేష్‌ను అమెరికాకు పంపడం, ఆ తరువాత విడాకులకు రంగం సిద్ధం చేయడం, విశ్వనాథ్ మొదటి భార్యను బెదిరించి ఆమె ఏ అభ్యంతరం తెలుపకుండా వ్యవహారమంతా చక్కబెట్టుకుంది. మొదటి భార్య ఇంటి గడప దాటదు. ఇక అన్నిచోట్ల మాడీ...పేరే మారుమ్రోగుతుంది" మాధవి వృత్తాంతాన్ని క్లుప్తంగా ముగించింది సుమ.

"ఇదంతా జరిగాక మాధవి నీకు ఎప్పుడూ ఎదురుపడలేదా వదినా?"బాధగా ప్రశ్నించింది రేవతి. తాను వింటున్న విషయాలన్నీ నిజమేనని తెలిసినా, నమ్మ బుద్ధికావడం లేదామెకు.

"రేవతీ! నీ బాధ నాకు తెలుసు. కానీ మాధవికి ఇప్పుడు గతంతో సంబంధమే లేదు. నాకు రెండు మూడు ఫంక్షన్లలో ఎదురుపడినప్పుడు "హలో! బాగున్నారా!" అంటూ రాజకీయనాయకుల ఫక్కీలో చేతులు జోడించి గబగబా వెళ్ళిపోయింది. ఆమె సంగతి మరచిపోవాల్సిందే"

నాలుగు సంవత్సరాల్లో ఎన్ని మార్పులు వచ్చాయి!

మాధవి కోర్కెల సంగతి తనకు బాగా తెలుసు కానీ వయస్సుతో పాటు మానసిక పరిపక్వత కలిగి తాను మారుతుందనుకుంది. ఎంత పొరపాటు పడింది తను.


తన కోర్కెలను తీర్చుకునేందుకు డబ్బు,

హోదా, పేరు ప్రఖ్యాతులు గడించేందుకు మాధవి ఎంత మంది జీవితాలతో ఆడుకుంది. విశ్వనాథ్ మొదటి భార్య, కూతురు వసంత, రమేష్, బాబు.... అందరినీ బాధపెట్టింది.

ఎంత స్వార్థపరురాలు మాధవి. రేవతి మనసు గతంలోకి జారిపోయింది.

★ ★ ★

అవి తాము ఇంటర్మీడియెట్ చదువుకునే రోజులు.



మాధవీ, తను, లత, ఇందిర, నిషా, పద్మ అంతా ఒక పెద్ద గ్రూప్.

చదువుల్లోను, అల్లరిలోనూ ముందుగా ఉండే ఈ బ్యాచ్ గురించి తెలియని లెక్చరర్లు, స్టూడెంట్లు ఉండేవారు కాదు.

మాధవి నాన్న రైల్వేలో హెడ్‌క్లర్క్‌గా పనిచేసే వారు. పెద్ద సంసారం..

ఎన్నో బరువు బాధ్యతలుండడం వల్ల మాధవి స్కూలు రోజుల్నుంచే తన కన్నా చిన్న క్లాసుల వారికి ట్యూషన్ చెప్పేది.

అందంగా ఉండే మాధవి కంఠం కూడా ఎంతో బాగుండేది.

అందరూ మోడ్రన్ డ్రెస్సెస్ వేసుకున్నా మాధవి మాత్రం తండ్రి బాధపడలేక సంప్రదాయంగా లంగా వోణీ, పొడగాటి జడ వేసుకుని కాలేజీకి వచ్చేది.

రోజూ బస్సు కోసం గంటల తరబడి బస్టాప్‌లో నిల్చున్నప్పుడు మాధవి, తను పాత సినిమా పాటలు పాడుకుంటూ టైం గడిపేవారు.

రోజు విడిచి రోజు తనింట్లోనే గడిపే మాధవిని అందరూ ఇంట్లో మనిషిగా భావించేవారు.

పక్కింట్లో ఉండే రేవతి పెదనాన్న గారు పాండురంగారావు గారు పరమ చాదస్తులు.

ప్రతి విషయంలోను తన మాటే నెగ్గాలనుకునే రకం.

ఆయన ఉద్దేశ్యంలో స్త్రీలు వంటింటికి, పడకగదికి మాత్రమే పరిమితమవ్వాల్సిన వారు.

అవకాశం దొరికినప్పుడల్లా 'సోకాల్డ్ ఫెమినిస్ట్'లను దుయ్యబట్టడానికి తయారుగా ఉండేవారు.

ఆయన ఇంట్లో ఉన్నప్పుడు మిగతా స్నేహితురాళ్ళు రావడానికి భయపడేవారు.

"అయ్యో బాబోయ్. మీ ఇంట్లో టైగర్ ఉన్నాడోయ్. మమ్మల్ని తినేస్తాడుగానీ మేం రాం" అని మొండికేసేవారు.

"ఆడపిల్లలంటే మాధవిలా ఉండాలి. ఆ కట్టు, బొట్టు సంస్కారం" పదే పదే మెచ్చుకునేవారు పాండురంగారావుగారు. ఆయన మాటలు అందరికీ విసుగ్గా ఉండేవి.

"మీ టైగర్ మాధవి ఫ్యాన్‌లాగున్నాడు. పైకి అది ట్రెడిషనల్‌గా కనిపించినా లోపల అది మోస్ట్ డేంజరస్ ఫెమినిస్టు అని ఆయనకు తెలీదు పాపం!" లత పకపకా నవ్వేది.

టైగర్‌నే బోల్తా కొట్టించిన మాధవి సామాన్యురాలు కాదు.

"రేవతీ!ఆ మోనాకెంత పొగరో చూడు. అంతా ఆడబ్బును చూసుకుని అహంకారం. ఏదో ఒకరోజు దానికన్నా ఎక్కువ డబ్బు కూడబెడతాను" ఉడుక్కుంటూ అనేది మాధవి.

డబ్బుంటే చాలు మనం నందంటే నందని, పందంటే పందని అందరూ వత్తాసు పలుకుతారు.

"డబ్బు ఎలా సంపాదించామన్నది ముఖ్యంకాదు. అది చేతికందాలి అంతే!" ధనప్రాప్తి సూత్రాలను వల్లించేది.

"అక్రమంగా డబ్బును సంపాదించి, ఆనందించాలనుకోవడం పొరపాటు. డబ్బు ఉన్నా లేకపోయినా ఉన్నతమైన విలువలు ఆశయాలతో జీవించడం ముఖ్యం"

రేవతి మాటల్ని కొట్టిపారేసేది మాధవి.

"ఈ సమాజంలో ఫలితాలే ముఖ్యం. విలువల గురించి మాట్లాడేది జీవితంలో ఓడిపోయినవారే. మీన్స్ అంటే సాధనాలు ముఖ్యంకాదు, ఎండ్స్ ఫలితాలే ముఖ్యం" అని వాదించేది.

"నువ్వు విలువలు, వల్లకాడు అంటూండు. నేను మాత్రం 'రిచ్ అండ్ పవర్‌ఫుల్' అయ్యి తీరుతాను" మాధవి అన్నంత పనీ చేసిందన్నమాట.

అప్పట్లో మాధవిని ప్రేమించి ఇళ్ళు, కారు మంచి ఉద్యోగం ఉన్న రమేష్ ఆమె తండ్రితో మాట్లాడడం, డిగ్రీ అవ్వగానే రమేష్‌తో మాధవి వివాహం జరగడంతో ఇంక మాధవి సర్దుకుపోతుందిలే పెద్ద కుటుంబం నుంచి వచ్చిన రమేష్ కట్నకానుకలు లేకుండా పెళ్లిచేసుకోవడం మాధవి అదృష్టమనీ అందరూ అనుకున్నారు.

అయితే రమేష్ సంపాదనతో తృప్తిపడే మనస్తత్వంకాదు మాధవిది. డబ్బుతో పాటు పేరు, ప్రతిష్ఠ, తనను తాను ఎంతో గొప్పవ్యక్తిగా చూసుకోవాలనే వాంఛ ఆమెలో ప్రబలమై ఆమెను పైశాచికంగా మార్చివేశాయి.

★ ★ ★

"ఏయ్ ఎంతసేపలా కుర్చీలో కూర్చుని ఆలోచిస్తుంటావ్!" ప్రదీప్ మాటలు విని ఉలిక్కిపడింది రేవతి.

"ఏం లేదండీ! పాత జ్ఞాపకాలు ఎటో తీసుకువెళ్లాయి" అంటూ లేచింది.

అంతలోనే కాలింగ్‌బెల్ మ్రోగింది.

లేచి వెళ్లి తలుపు తీసిన రేవతికి ఎదురుగా పాండురంగారావుగారు కనిపించారు.

"రండి! రండి! పెదనాన్న. ఇందాక మిమ్మల్ని తలుచుకున్నాను. చూశారా తలుచుకోగానే వచ్చారు" అంటూ ఆయన కూర్చునేందుకు వీలుగా కుర్చీని ముందుకు జరిపింది.

"పోన్లేమ్మా. మీరంతంత దూరాలు వెళ్లినా మమ్మల్ని మరచిపోలేదు. అందులో నీలో ఏ మార్పులేదు" కొంచెం ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ అన్నారు పాండురంగారావుగారు.

"అవునులే పెదనాన్న. మేం మామూలుగానే ఉన్నాం. మీ ఊళ్ళోనే అంతా మారిపోతున్నారు. మాధవి కథ తెలుసుగా. ఎలా మారిపోయిందో!" ఆయన ఏమంటారో తెలుసుకోవాలనే కుతూహలంతో అంది రేవతి.

"మాధవి...అదే మాడీ చాలా గొప్ప సేవ చేస్తోందమ్మా. అబ్బో ఎన్నెన్ని కార్యక్రమాలను నిర్వహిస్తుందో. అలా చేయడం సులభం కాదు. ఇక ఆ రమేష్ సంగతి వదిలేసిందంటే వాడేం చేశాడో. ఉత్త వెధవై ఉంటాడు. అంత పెద్ద పెద్ద వారితో, విఐపిలతో స్నేహం అందరికీ సాధ్యమా! అంత డబ్బున్నప్పుడు కొంచెం గర్వం రావడం సహజమే" పాండురంగారావు మాటలు అన్నిటికన్నా పెద్ద షాక్ కలిగించాయి.

'అన్ని నీతులు చెప్పే పెదనాన్న మాధవిని వెనకేసుకురావడం అసలు ఊహకందని స్పందన. నిజమే. ఈ సమాజానికి కేవలం ఫలితాలే కావాలి సుమా!

నైతిక విలువలు, ఉన్నతమైన ఆశయాలు, సేవాదృక్పథం.. ఇవన్నీ కేవలం పుస్తకాలకే పరిమితం.

సమాజంలో ఎప్పుడూ నీతులు వల్లించే పాండురంగారావులాంటి వ్యక్తులు అభిప్రాయాలను, సందర్భాన్ని బట్టి మార్చడం బాధకరంగా అనిపించింది.

అడ్డదార్లను కూడా రహదారిగా చిత్రీకరించడం ఇటువంటి బూటకపు నీతులు పలికేవారికే చేతనవుతుంది' అనుకుంది రేవతి.

ఆమెకు స్నేహితురాల్ని కలవకుండా అమెరికా తిరిగి వెళ్లడం బాధాకరంగా అనిపించలేదు.

★

## ధైర్యం



తల్లిదండ్రుల జీన్స్ ప్రభావం పిల్లల ప్రవర్తనపై పడుతుంది. ఇది ఎవరూ కాదనలేని సంగతి. అందాల భామ సెలీనాజైట్లీ తండ్రి ఓ కెప్టెన్. దేశం కోసం నిస్వార్థంగా సేవచేస్తున్న ఆయన లక్షణాలు తనలో చాలా ఉన్నాయంటోంది. అందుకేనేమో ఆమె కొన్ని విషయాల్లో ఎంతో ధైర్యంగా మాట్లాడుతుంది. మనకున్న అభిప్రాయాల్ని మనం ధైర్యంగా వ్యక్తీకరించాలి అని ఘంటాపథంగా చెబుతోంది సెలీనాజైట్లీ. సినిమా ఛాన్స్‌ల గురించి ఎవరిపైనా తాను ఒత్తిడి తీసుకురావడం లేదంటోంది.

